మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# సీఎం సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

**- 30 సంవత్సరాలుగా పార్టీకే అంకితం, - సర్పంచ్‌గా మల్లెపాకుల వెంకటయ్య**






కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ

**వంగూరు, నవంబర్ 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ ఏకగ్రీవం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలలో శనివారం నామినేషన్ల పర్వం చివరి రోజు కావడంతో 15 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు ఉన్నప్పటికీ గ్రామ పెద్దలు చర్చించి ఏకగ్రీవంగా సర్పంచ్‌ను నిర్ణయించాలనే లక్ష్యంతో చేసిన చర్చలను సఫలీకృతం చేసి మల్లెపాకుల వెంకటయ్యను కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్‌తో పాటు గ్రామంలో ఉన్న 10 వార్డు లకు 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. సర్పంచ్‌గా ఎన్నికైన మల్లెపాకుల వెంకటయ్య గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ ఆ పార్టీకి చేసిన సేవలను గుర్తించి కొండారెడ్డిపల్లి ఎస్సీ రిజ్వర్డ్ కావడంతో 15 మంది బరిలో నిలిచేందుకు సిద్ధం అయ్యారు. కానీ వారిలో మల్లెపాకుల వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటయ్య సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు గ్రామ అభివృద్ధి పార్టీ అభివృద్ధికి సంబంధించిన విషయాలను చేరవేస్తూ అభివృద్ధి కోసం కృషి చేశాడని గుర్తించిన గ్రామస్తులు వెంకటయ్యకు గ్రామ ప్రథమ పౌరుడిగా పట్టం కట్టారు.




మెడికల్ కళాశాల ఫైల్ ఫోటో

## నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో
# ర్యాగింగ్ కలకలం

- 4గురు మెడికల్ విద్యార్థుల సస్పెన్షన్
- గత ర్యాగింగ్ బాధితుడే నేడు నిందితుడు
- ఆలస్యంగా వెలుగు చూసిన ర్యాగింగ్ ఘటన

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మరో మారు ర్యాగింగ్ కలకలం రేగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. జూనియర్లు ఈ వ్యవహారాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురాగా యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి నలుగురు విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆలస్యంగా తెలిసింది. ఇదిలా ఉండగా గతంలో ర్యాగింగ్ బాధితుడు ఈ కేసులో నిందితుడిగా ఉన్నట్లు సమాచారం. ర్యాగింగ్‌కు కారణమైన నలుగురు వైద్య విద్యార్థులను 2 నెలల పాటు అకాడమిక్ ఆక్టివిటీస్ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఏడాది పాటు హాస్టల్లో అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ర్యాగింగ్ నిరోధించడానికి ఏర్పాటు చేసిన కమిటీ ఉన్న ఇలాంటి ఘటనలు జరగడం అనేక విమర్శలకు తావిస్తుంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి

- జూరాల ప్రాజెక్టు దగ్గర రూ.70 కోట్ల నిధులతో ఫిషరీస్ కళాశాల నిర్మిస్తా
- ఏకగ్రీవ గ్రామపంచాయతీ గ్రామాలకు 20 లక్షల నిధులు ఇస్తా
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



ఎన్నికల సన్నహాక సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి

**అమరచింత నవంబర్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లకే మక్తల్ నియోజకవర్గం లో 400 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నానని గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలలో అభివృద్ధికి పట్టం కట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి ఆయా గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజ్ గౌడ్ తో కలిసి రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన హామీల మేరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీతో పాటు 500 బోనాస్ ఇచ్చామని మహిళలకు 500 కే సిలిండర్, ఉచిత విద్యుత్తు, మహిళలకు వడ్డీ లేని రుణాలు అమలు చేశామని ఆయన అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డు, సన్నబియ్యం పేదలకు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వ హాయములో రేషన్ కార్డు లేని ప్రతి పేద వారికి రేషన్ కార్డు తో పాటు సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ ఇదేనని ఆయన అన్నారు. అలాగే అమరచింత మండలంలోని అనేక గ్రామాలలో సీసీ రోడ్లు, బీటి రోడ్లు వేశామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేరుగాంచిన జూరాల ప్రాజెక్టు దగ్గర 70 కోట్ల నిధులతో ఫిషరీస్ కళాశాల నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఏకగ్రీవ సర్పంచు ఎన్నికైన గ్రామాలకు 20 లక్షల నిధులు ఇస్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని గ్రామాలు ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకి వివరించి ఓట్లు అడగాలని ఆయన కార్యకర్తల ను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపిటిసిలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు, లక్ష్మీ ్రకాంతరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు, విష్ణు, కమలాకర్ గౌడ్, రవికాంత్, శ్యామ్, ఏకే వెంకటేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాకేష్ గౌడ్, హరీష్ నాయక్, తౌఫిక్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళ్ళు అర్పిస్తున్న బిఆర్ యస్ నాయకులు

## కేసీఆర్ దీక్షతోనే
# తెలంగాణ ఏర్పాటు

**దీక్ష దివాస్ కార్యక్రమంలో వక్తలు...**

**గద్వాల టౌన్, నవంబర్ 29, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కేసీఆర్ దీక్షతోనే సాధ్యం అయిందని దీక్ష దివాస్ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. శనివారం గద్వాల బిఆర్ యస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్ష దివాస్ కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డా. ఆంజనేయులు గౌడ్ ,గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బి. ఎస్. కేశవ్ ముఖ్యతిదులుగా హాజరై ప్రసంగించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో ప్రాణాలకు తెగించి కేసీఆర్ చేపట్టిన దీక్ష నవంబర్ 29 రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఉద్యమ నేతగా కేసీఆర్ తీసుకున్న గొప్ప నిర్ణయంతోనే రాష్ట్రం సాకారమైందని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పుట్టిందే బీఆర్ఎస్ పార్టీ అన్నారు. ఉద్యమ సమయంలో అనేక బెదిరింపులు వచ్చినా వెనక్కి తగ్గకుండా పోరాటం చేశామని గుర్తు చేశారు. ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను కేసీఆర్ దృష్టికి -మిగతా4లో..

# నామినేషన్ల స్క్రూటినీ ఏర్పాట్లు సిద్ధం చేసుకోండి

- డిసెంబర్ 1న అన్ని మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం
- పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోండి
- పోలింగ్ ముందురోజు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలి
- ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి




ఎన్నికల నిర్వహణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి, నవంబరు 29 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు నిర్లక్ష్యానికి తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహసిల్దారులు, ఎంపీడీవోలతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న ఐదు మండలాలకు సంబంధించి నామినేషన్ల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ ఒకటో తేదీన అన్ని మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు ఓటింగ్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన స్థలం, కంప్యూటర్లు, మౌలిక వసతులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా డిసెంబర్ 4వ తేదీన ఒపిఒలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొని సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కు అవసరమైన ఫారం 14, ఫారం 17 శిక్షణ రోజు ఇచ్చే విధంగా చూడాలని సూచించారు. మొదటి విడతలో జరిగే ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ డిసెంబర్ 8వ తేదీన, రెండవ విడత వారికి డిసెంబర్ 12, మూడవ విడతకు డిసెంబర్ 14వ తేదీన సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోల్ అయ్యాక వాటిని స్ట్రాంగ్ రూమ్ లో భద్రం చేసి పోలీస్ కాపలా ఉండే విధంగా ఎతేసుకోవాలని సూచించారు. పోలింగ్ ముందురోజు బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ పోలింగ్ స్టేషన్లకు పంపించే విధంగా మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు మండల స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ ఉపసంహరణ చేసుకునే అభ్యర్థుల నుంచి అనెక్సర్ 1 లో సంతకం తీసుకోవాలని, ఒకవేళ ఒక్కరే అభ్యర్థి పోటీలో మిగిలితే అభ్యర్థి నుండి అనెక్సర్ 2 తీసుకోవాలని సూచించారు. ఓటరుకు సకాలంలో ఓటర్ స్లిప్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రిసైడింగ్ అధికారికి ముందుగానే అందించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, డిపిఓ తరుణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి రఘుపతి రెడ్డి, పిడి డిఆర్డిఓ ఉమాదేవి, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న షీటీమ్ పోలీసులు

# షీ టీమ్ ప్రత్యేక చర్యలు

**9 మంది యువకులకు కౌన్సిలింగ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 29 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌టౌన్ పరిధిలో షీటీమ్ సిబ్బంది మహిళల భద్రత, బాలికల రక్షణ, ఈవ్ టీజింగ్ నిరోధక చర్యల్లో భాగంగా గట్టి తనిఖీలు చేపట్టారు. గతవారం రోజుల నుంచి టౌన్‌లోని వివిధ పార్కులు, పాఠశాలలు, కాలేజీల వద్ద సందేహాస్పదంగా తిరుగుతూ మైనర్ బాలికలకు మాయమాటలు చెప్పి వారిని ఒంటరి, ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న 9 మంది యువకులను షీ టీమ్ వెంటనే గుర్తించి అడ్డుకున్నారు. అనంతరం వారిని షీ టీమ్ కౌన్సిలింగ్ సెంటర్‌కు తరలించి, షీ టీమ్ కౌన్సిలింగ్ సెంటర్‌లో వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉమెన్ పి.ఎస్. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ యువకులకు ముఖ్య సూచనలు చేశారు. మైనర్ బాలికలతో అసభ్యంగా ప్రవర్తించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలు భవిష్యత్ జీవితం కెరీర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. పబ్లిక్ ప్రదేశాల్లో మహిళల భద్రతను కించపరచే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. యువత ప్రవర్తనలో బాధ్యతాయుతమైన మార్పు రావాల్సిన అవసరం ఉందని, మహిళలను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈకార్యక్రమంలో షీటీమ్ సభ్యులు పూర్తిస్థాయిలో పాల్గొన్నారు. మహిళల భద్రత కోసం షీటీమ్ నిత్యం పహారా, తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని జిల్లాపోలీసుశాఖ తెలిపింది.

## పంచాయతీ ఎన్నికల పదవుల వేలంపాట
# నిరోధించేందుకు ప్రజలకు అవగాహన



ఎన్నికల ఏకగ్రీవంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సంస్థల ఎన్నికల్లో ఆయా పదవుల వేలంపాటతో ఏకగ్రీవాలను నిరోధించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని గ్రామపంచాయతీలలో నామినేషన్ వేసేందుకు ముందుకు వచ్చే అభ్యర్థులను కొందరు ప్రలోభాలకు గురిచేయడం, బల ప్రయోగం చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఎన్నుకోవాలనుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. మొదటి విడత ఎన్నికలు జరిగే ఆయా మండలాల్లోని కొన్ని గ్రామాల్లో సర్పంచి పదవులకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల చట్టం, భారతీయ శిక్షాస్మృతి కింద ఇలాంటి చర్యలను ఎన్నికల నేరాలుగా పరిగణిస్తూ అనైతిక చర్యల నిరోధానికి తగిన యంత్రాంగాన్ని నియమించి ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా మండలాల్లోనీ ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, పోలీస్ శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి అనైతిక ఏకగ్రీవాలను నిరోధిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత ఎన్నికలు జరిగే గద్వాల ,ధరూర్, కేటీ దొడ్డి, మల్దకల్ మండలాల్లోనీ పలు గ్రామాల్లో ఇప్పటికే కొంతమంది స్వప్రయోజనాల కోసం ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసేలా వేలంపాటల ద్వారా సర్పంచి పదవులను నిర్ణయించడం అనేది తీవ్రమైన చర్యగా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా గ్రామపంచాయతీల్లో పలుకుబడి కలిగిన అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్లు లంచాలను ఇవ్వడం, తమ పలుకుబడి ఉపయోగించడం వంటి సంఘటనలను జిల్లా ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గద్వాల మండలం పరమాల, నల్ల దేవునిపల్లి, కొండపల్లి గ్రామ పంచాయతీలతోపాటు మల్దకల్ మండలం నీలిపల్లి, గట్టు మండలం మిట్టదొడ్డి, కేటీ దొడ్డి మండలం చింతలకుంట, రంగాపురం, ఉమిత్యాల తండా గ్రామపంచాయతీలకు సర్పంచ్ పదవులను వేలంపాట ద్వారా అమ్ముకున్నట్లు వచ్చిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఆయా మండలాల ఎన్నికల అధికారులు వివిధ గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. అక్కడ ఓటర్లు, గ్రామ పెద్దలతో ఏకగ్రీవ వేలంపాట విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారనీ పేర్కొన్నారు. ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎస్ఐలతో కూడిన తమ ఎన్నికల యంత్రాంగం ఇటువంటి అనైతిక పదవుల ఎంపికపై నిఘా ఉంచుతుందని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. సర్పంచ్ పదవుల వేలంపాట ఏకగ్రీవాలకు ప్రోత్సహించిన వారికి అపరాధంగా జరిమానా విధించడమే కాక ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా రెండు విధించవచ్చు అన్నారు. అపరాధము చేసిన వ్యక్తి ఆరు సంవత్సరాలపాటు ఎన్నికలలో పోటీ చేయడానికి కూడా అనర్హులు అవుతారని తెలిపారు.

# జర్నలిస్టుల హక్కులను కాపాడుతాం

- ప్రభుత్వం మెడలు వంచుతాం
- టీయూడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ
- ఘనంగా మహబూబ్‌నగర్ జిల్లా తృతీయ మహాసభలు




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత అధికార పార్టీ రెండేళ్లు గడచిన ఎటువంటి చర్యలు తీసుకోక పోవటాన్ని నిరసిస్తూ డిసెంబర్ 3 నుంచి నిరసన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ప్రకటించారు. అనేక సందర్భాల్లో గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్ కార్డులను రెన్యువల్ చేస్తున్నారన్న విషయంతో పాటు హెల్త్ కార్డులు పనిచేయడం లేదన్న వాస్తవాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోతుందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు త్వరలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలలో జర్నలిస్టులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధంగా ఉన్న తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సుదీర్ఘ కాలం పాటు జర్నలిస్టుల ప్రయోజనాల కోసమే కృషి చేస్తుందని ఆయన వివరించారు. జర్నలిస్టుల ప్రయోజనాల అధికారపక్షంతో నిరంతరం పోరాటం చేసే సత్తా ధైర్యం గల యూనియన్ లో జర్నలిస్టులు సభ్యత్వం పొందాలని ఆయన సూచించారు. అక్రిడేషన్ కార్డులు... హెల్త్ కార్డులు... అర్హులైన జర్నలిస్టులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే వరకు ప్రభుత్వంతో పోరాటం చేస్తామని టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు వ్యవహరించిన తీరు వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలోని జర్నలిస్టు సంఘాలు బలహీన పడ్డాయని... ఒక్కొక్క జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులను సమన్వయపరుస్తూ సంఘాన్ని బలోపేతం చేశామని రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ వెల్లడించారు. గత కొన్నేళ్లపాటు యూనియన్ సభ్యుల తిరువళ్ల స్తబ్దత నెలకొందని అన్నారు. అన్ని మండలాలను పర్యటించి జర్నలిస్టులలో యూనియన్ చేపడుతున్న కార్యక్రమాలు జర్నలిస్టుల సంక్షేమానికి పలు పథకాల కోసం ప్రభుత్వాన్ని ఒప్పించి సాధిస్తున్న విజయాలను వివరించటం వల్ల పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టడం వల్ల మూడవ మహాసభలు విజయవంతమయ్యాయని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మూడో మహాసభలకు కన్వీనర్ విజయ రాజు అధ్యక్షత వహించగా.... యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి, ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిరియాల కర్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ ముదిరాజ్, లక్ష్మణ్ యాదవ్, సురేందర్ రెడ్డి, ఆనంద్ కుమార్ గౌడ్, ముజీబ్ వివిధ దిన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రతినిధులు... వివిధ మండలాల విలేకరులు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమ కోసం టియూడబ్ల్యూ జే ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వం ద్వారా హక్కులు సాధించుకుందామని పలువురు పిలుపునిచ్చారు.

## తెలంగాణ ప్రజలకు పవన్
# క్షమాపణ చెప్పాల్సిందే

**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలవి దిష్టి కండ్లు అంటూ వ్యాఖ్యానించిన ఏపీడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనం పల్లి అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల దిష్టి కండ్లు తలగడం కారణంగా గోదావరి ప్రాంతం ఆగమైపో యిందంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ శనివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన అనిరుధ్ రెడ్డి పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌కు ఏపీ పై ప్రేమ ఉంటే తెలంగాణలో ఉన్న ఆస్తులు అమ్ముకొని విజయవాడకు వెళ్లిపోవాలని, అలా చేయకుండా కొత్తగా ఇక్కడ ఆస్తులు ఎందుకు కొంటున్నారని నిలదీశారు. మెగా స్టార్ చిరంజీవికి తమ్ముడు కాకపోయి ఉంటే పవన్ యాక్టర్ అయి ఉండేవారా ? అని ప్రశ్నించారు. సామాన్యుడైన తాను పదేళ్లకే సీఎం అభ్యర్థి అవుతానని అంటుంటే పవన్ 15 ఏళ్ల తర్వాత సీఎం అవుతానంటున్నారని, 70 ఏళ్ల వయసులో ఆయన సీఎం అయి చేసేదే ముందని ఎద్దేవా చేశారు. తాము కూడా మెగాస్టార్ -మిగతా4లో..

## నెలరోజుల తర్వాత ఉల్పర మొల్గర బస్సుల రాకపోకలు ప్రారంభం

**ఉప్పునుంతల, నవంబరు 29 ప్రభాతవార్త :** గత నెల 26,27 న కురిసిన భారీ వర్షాలకు దుందుభి వాగులో ఉన్న కాజ్ వే దెబ్బ తినడంతో రాకపోకలు అప్పటినుంచి నిలిచిపోయాయి. ఇటీవల తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు, టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ దుందుభి వాగులో దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడంతో ఈ మార్గం రాకపోకలకు అంతరాయం లేకుండా చేయడంతో అచ్చంపేట ఆర్టీసీ అధికారులు శనివారం అచ్చంపేట నుంచి ఉప్పునుంతల, మొల్గర, ఉల్పర మీదుగా కల్వకుర్తికి బస్సు సౌకర్యం ప్రారంభించారు. నెల రోజులపాటు పూర్తిగా రాకపోకలు నిలిచిపోవడంతో ఈ ప్రాంత వాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ వెళ్లాలంటే మామిళ్ళపల్లి, లక్ష్మాపూర్, పెద్దాపూర్, మొల్గర, సదగోడు ప్రాంతవాసులు ఉప్పునుంతలకు వచ్చి వెళ్ళవలసి వస్తుండేది. శనివారం అచ్చంపేట ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును పునః ప్రారంభించడంతో ఈ ప్రాంత వాసులు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ఆల్ఇండియా వాలీబాల్ టోర్నీకి ఎంపికైన సంతోష్

**నారాయణ పేట, నవంబరు 29 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ టోర్నీలో నారాయణపేటకు చెందిన చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి సంతోష్ యాదవ్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చే నెల డిసెంబర్ 10 నుండి 14 వరకు జెఎన్టీయూ కాకినాడలో జరిగే ఆల్ ఇండియా వాలీబాల్ టోర్నీలో అతను పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. సంతోష్ యాదవ్ ఎంపిక సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. మెర్సీ వసంత, స్పోర్ట్స్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, రాజ్ కుమార్, లక్ష్మారెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్, విశ్వనాథ్, కృష్ణ, కవిరాజు, సురేష్, అశోక్ తదితరులు అభినందనలు తెలిపి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



వాలీబాల్ టోర్నీకి ఎంపికైన సంతోష్ యాదవ్

## ఏకగ్రీవం అంటే ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయడం లాంటిదే

### బీఎస్పీ నియోజకవర్గం అధ్యక్షులు శ్రీకాంత్

**నవాబుపేట, నవంబరు 29 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంలో పలుచోట్ల ఏకగ్రీవం చేయడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడం లాంటిదని బీఎస్పీ జడ్చర్ల నియోజకవర్గం అధ్యక్షులు శ్రీకాంత్ ముదిరాజ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓట్లు లేకుండా ఏకగ్రీవాలు చేస్తే అప్రజాస్వామికం అవుతుందన్నారు. ఏకగ్రీవం పేరుతో ఆ గ్రామానికి డబ్బులు ఇవ్వడం జరుగుతున్నది, ఇది ఆ గ్రామానికి పెనుముప్పుగా మారే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఎంత డబ్బు అయినా ఇస్తాము ఏకగ్రీవంగా ఎన్నుకోండి అని బహిరంగంగా పేపర్ స్టేట్‌మెంట్లు ఇస్తున్న వారిపై రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్‌లు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అట్టహాసంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

**నారాయణ పేట,నవంబరు 29 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మినీ స్టేడియంలో దివ్యాంగుల క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మహిళా,శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉత్సాహం, ఆత్మస్థైర్యం పెంపొందించడం తమ లక్ష్యమని అన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభను చూపించాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరిచిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీడీపీవో జయ మాట్లాడుతూ, గెలుపు-ఓటమి సహజమని, ఐక్యతతో ఆనందంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ సాయి,డీడబ్ల్యూఓ శాఖ సిబ్బంది, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షులు నగేష్ గౌడ్ అజీజ్ ఖాన్, అలాగే కాశప్ప,రాధా తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను వెలికితీశారు. ఈ క్రీడా పోటీలు వారి ఆత్మవిశ్వాసానికి వేదిక అయ్యాయి.



క్రీడా పోటీలలో పాల్గొన్న దివ్యాంగులు

## బాలుర పాఠశాలలో ఇంగ్లీష్ భాషాభివృద్ధి పై స్పెల్లింగ్ బి కాంపిటీషన్

**ఉప్పునుంతల, నవంబరు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాలలో శనివారం ఇంగ్లీష్ భాషాభివృద్ధి కోసం స్పెల్లింగ్ బి కాంపిటీషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై అవగాహన పెంపొందించడానికి విద్యార్థులను ఐదు గ్రూపులుగా ఏర్పాటు చేసి స్పెల్లింగ్ బి కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచిన ఆలూరు శ్రీజ గ్రూపు సభ్యులు బొల్లె చక్రవర్తి, మదనాగుల ప్రవీణ్, మదనాగుల మీనాక్షి, మదనాగుల శృతి, బొల్గం మినీశ్వర్, పాత్కుల ఆర్య మొదటి బహుమతి అందుకున్నారు. మిగతా గ్రూపు విద్యార్థులకు భవిష్యత్తులో జరగబోయే కాంపిటీషన్లో విజయం సాధించేలా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్పెల్లింగ్ బి కాంపిటీషన్ వల్ల విద్యార్థులలో ఇంగ్లీష్ పదజాలం అభివృద్ధి చెంది భాషపై అవగాహన పెరుగుతుందన్నారు. ఆధునిక డిజిటల్ యుగంలో ఆంగ్ల భాష ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం లో బాగా చదువుకొని రాణించాలని ఇంగ్లీష్ భాష పై పట్టు సాధించి భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, చందన, సంగీత, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విజేతలు

## బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**బిజినేపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె. శ్రీనివాస్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని ఆయా గ్రామాల బెల్ట్ షాపుల నిర్వహణ దారులతో శనివారం సమావేశం నిర్వహించారు. కొందరు కిరణ, చికెన్ సెంటర్లు, కూల్ డ్రింక్స్ షాపులని పేరు బోర్డులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తమ సిబ్బందితో దాడులు నిర్వహించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలక్షన్ కోడ్ నియమావాళిని పాటించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసిల్దార్ మునీరుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా 144 మంది బెల్ట్ షాపు నిర్వాహనదారులను బైండోవర్ చేసి, బెల్ట్ షాపులను నిర్వహించబోమని సొంత పూచికత్తు తీసుకున్నారు.



బెల్టుషాపు నిర్వహణ దారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# కొత్త, పాత తేడాలు వద్దు కలసికట్టుగా పనిచేయాలి

### రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

**ఆత్మకూర్ , నవంబర్ 29, ప్రభాతవార్త :** ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతా మరియు కొత్త తేడాలు చూపకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు గుర్రాలకి అవకాశం ఇస్తుందని స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించి ప్రజా ప్రభుత్వానికి మద్దతు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం అనవసర రాజకీయాలు చేస్తూ ప్రగతిని అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్న విషయాన్ని గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండలంలోని 12 గ్రామపంచాయతీలను దైవసం చేసుకునేందుకుగాను మండల నాయకత్వం ఆధ్వర్యంలో 20 మంది కమిటీని ఎంపిక చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు 20 మందితో పాటుగా తాను బాధ్యత వహిస్తానని మంత్రి అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మండల స్థాయి నాయకత్వం నిర్విరామంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. మక్తల్ నియోజకవర్గం లోని ప్రతిపక్ష నాయకులు మాత్రం తమ ఉనికిని చాటుకునే విధంగా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీపై ప్రజా ప్రభుత్వం పై అనవసరమైన ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని అభివృద్ధి కొనసాగాలంటే అధికార పార్టీతో కలిసి ప్రజలకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి కానీ బురదజల్లే రాజకీయాలు ఇప్పటికైనా మానుకోవాలని ఆయన హితోపలికారు. ప్రజలు తమకు ఐదు సంవత్సరాలు పాలించాలని పట్టం కట్టారని అలా కాకుండా ప్రతిపక్షాలు మాత్రం ప్రభుత్వాన్ని దించుతాం అంటూ అనవసరమైన ప్రోగాల్బాలు పలుకుతూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్న విషయాన్ని కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్ స్థానిక నాయకులు మహమ్మద్ రఫీ, గాలి పంపు శ్రీనివాసులు, మనివర్ధన్ రెడ్డి, దామోదర్, వెంకటన్న, బుచ్చన్న, నాగేష్ తదితరులతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

## స్థానిక సంస్థలలో విజయమే పార్టీ భవిష్యత్తుకు పునాది

### - బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి :మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 29 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు భవిష్యత్తులో మనం అధికారంలోకి రావడానికి పునాదులు అవుతాయని పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. దీక్షా దివస్ సందర్భంగా తిమ్మాజీపేట మండలం గుమ్మకొండ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నా విజయానికి రెండు సార్లు సహకరించిన మీ విజయం కోసం పల్లె పల్లె తిరుగుతా, స్థానిక సంస్థల ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఒక్కో స్థానానికి నలుగురు చొప్పున పోటీ పడుతున్నారని అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఆమోదించి ఒక అభ్యర్థిని నిలబెట్టుకొని గెలిపించుకోవాలని అందుకు తామందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కొన్ని ప్రాంతాలలో ఏకగ్రీవాల కోసం పక్క పార్టీ వారితో మనవాళ్లు మూలాఖాతు కావడం తన దృష్టికి వచ్చిందని అలాంటి చర్యలను మానుకోవాలని సూచించారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి కృషి చేయాలి తప్ప పక్క పార్టీ నాయకుల మెప్పు కోసం పార్టీకి నష్టం చేసే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. పదేళ్లలో తాము చేసిన అభివృద్ధి సంక్షేమం గురించి ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని అదేవిధంగా అధికారంలోకి తప్పుడు మార్గంలో అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ తప్పులను తప్పిదాలను ప్రజలకు వివరించాలని మర్రి సూచించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాజీపేట మండల నాయకులు తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

## నామినేషన్ పత్రంలో ఖాళీలు ఉంచకూడదు : ఎంపిడిఓ వరుణ్ తేజ

### నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలి

**ఉప్పునుంతల,నవంబరు 29 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికలలో నామినేషన్ వేసే అభ్యర్థులు పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలని ఎంపిడిఓ వరుణ్‌తేజ,మండలపంచాయితీ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకమిషన్,జిల్లాఎన్నికల అధికారి ఆదేశాలమేరకు మండలంలో డిసెంబర్ 17న జరుగు గ్రామపంచాయతీ ఎన్నికలకు డిసెంబర్ 3న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు వారు వివరించారు.మండలంలో 7నామినేషన్ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని వివరించారు. నామినేషన్‌పత్రంలో ఖాళీలు ఉంచకూడదని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో నామినేషన్ దాఖలు పై పలు సూచనలు చేశారు. 1. నామినేషన్ తో పాటు ఇద్దరు సాక్షులతో సెల్ఫ్ డిక్లరేషన్ దాఖలు చేయాలి. ఎవరైనా అభ్యర్థి నామినేషన్ తో పాటు సెల్ఫ్ డిక్లరేషన్ ను దాఖలు చేయడంలో విఫలమైతే అతను, ఆమె దానిని నామినేషన్ చివరి సాయంత్రం 5 గంటల లోపు దాఖలు చేయాలి. డిక్లరేషన్ కోసం అఫిడవిట్ కానీ, నోటరీ కానీ అవసరం లేదు. 2. అన్ని నిలువు వరుసల ను పూరించాలి .ఏ కాలమ్‌ను ఖాళీ ఉంచకూడదు. ఏదైనా వస్తువుకు సంబంధించి అందించడానికి సమాచారం లేకుంటే, సందర్భానుసారంగా " నిల్" లేదా "వర్తించదు"అని పేర్కొనాలి.3. స్వీయ డిక్లరేషన్ టైపు చేయాలి లేదా స్పష్టంగా, చక్కగా రాయాలి. అభ్యర్థులు నామినేషన్ పత్రాన్ని పూర్తిగా నింపవలసి ఉంటుంది ఎక్కడ ఖాళీలు ఉంచకూడదు.4. పోస్టల్, బ్యాంకు ఖాతా లేదా ఇతర బ్యాంకులలో ఖాతాలు అయినా నామినేషన్ వేసే అభ్యర్థి నూతన బ్యాంకు ఖాతా తప్పనిసరిగా తీసుకోవాలి. 5. ఎస్సీ,ఎస్టీ, బీసీ కులాల అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత పరచాలి. 6. సర్పంచు, వార్డు మెంబర్ సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పై సూచనలు నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పక పాటించాలని ఎంపిడిఓ వరుణ్ తేజ, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



ఎంపిడిఓ వరుణ్ తేజ

## సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం చట్ట విరుద్ధం

### బహుజన్ సమాజ్ పార్టీ మక్తల్ అధ్యక్షుడు కే.వి నరసింహ

**మక్తల్ టౌన్, నవంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న 12 వేల గ్రామ పంచాయతీలకు పైచిలుకు స్థానిక ఎలక్షన్లో ఏ గ్రామపంచాయతీ నుండి కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం చట్టవిరుద్ధమని అలాగే ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ ఏ గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో నడవదని బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు కేవీ నరసింహ అన్నారు. ముఖ్యంగా జనరల్ గా వచ్చిన గ్రామపంచాయతీలలో ఎక్కువగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరుగుతుంది. అయితే 10 లక్షలు నుంచి కోట్లలో వేలం పాటలలో గ్రామ పంచాయతీని సాధించుకున్న గ్రామ సర్పంచ్ రానున్న రోజులలో గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయడానికి ఏమాత్రం నోచుకోదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎందుకంటే కోట్లు పెట్టి గ్రామాన్ని కొన్నవాడు ఎంతసేపైనా తాను తిరిగి రాబట్టుకోవడానికి చూస్తాడు తప్ప గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఏమాత్రం ఆలోచన చేయరు. కనుక ప్రతి ఒక్కరు కూడా గ్రామంలో ఉండే యువత, యువకులు, గ్రామ పెద్దలు కూడా ప్రతి ఒక్కరు ఆలోచన చేసి ఏకగ్రీవంగా అడ్డుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అయితే 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క ఓటరు కూడా తను నామినేషన్ వేసి యువత రాజకీయంలోకి రావాలని పిలుపునిచ్చారు. చదువుకున్న యువత కూడా ఎలక్షన్లలో అభ్యర్థిగా పోటీలో నిలబడి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపే వ్యక్తి ఓటర్లను మెప్పించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపే యువత మాత్రమే ముందుకు రావాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఓటును అమ్ముకోవద్దు నిజాయితీగల పౌరులు నిలబడి గెలవాలని అలా గెలిచినవారు నీతి నిజాయితీతో గ్రామ అభివృద్ధి పథంలో నడిపించడానికి యువత మాత్రమే చేయగలుగుతుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

## విద్యార్థులకు శీతాకాల రక్షణ సామగ్రి పంపిణీ

**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** జిల్లాలోని బాల బాలికల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన శీతాకాల రక్షణ సామాగ్రి స్వెటర్లు, ఉలెన్ రగ్గులు పంపిణీ చేసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను నివారించడానికి రక్షణాత్మక వాతావరణం కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ చొరవతో షెడ్యూల్డ్ కులముల శాఖ ముందడుగు వేసి జిల్లాలోని అన్ని వసతి గృహాలను ప్రత్యేక్షంగా సందర్శించి, ప్రతి విద్యార్థికి స్పెషల్ ఆఫీసర్, హాస్టల్ వార్డెన్ సమక్షంలో వ్యక్తిగతంగా స్వెటర్లు, ఉలెన్ రగ్గులు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం అత్యంత ప్రాధాన్యమని, సరైన రక్షణతో పిల్లలు ఆరోగ్యంగా ఉండి విద్యాభ్యాసంలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం తమ బాధ్యత అని ఆమె తెలిపారు. కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల సంక్షేమం కోసం భవిష్యత్తులో మరిన్ని పథకాలను అమల్లోకి తేనున్నట్లు పేర్కొన్నారు.ఇప్పటికే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని, శీతాకాల రక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థుల పట్ల కలెక్టర్ చూపిన శ్రద్ధ, ఔన్నత్యానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

## కౌకుంట్లలో కాషాయ జెండా ఎగరాలి

### పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి

**దేవరకద్ర, నవంబరు 29 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలంలో కాషాయ జెండాను రెపరెపలాడించాలని,స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కౌకుంట్ల మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బడుగుల రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన,జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ రోడ్లు ముఖ్యమైన పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కేంద్రం అందిస్తున్న ఈ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా గెలిపించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ వడ్ల శివశంకర్, భూత్ అధ్యక్షులు కార్యకర్తలు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పవన్‌కుమార్‌రెడ్డి

## కంసానిపల్లిలో ఘనంగా పల్లకి సేవ



పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమంలో స్వాములు

**ఉప్పునుంతల, నవంబరు 29 ప్రభాతవార్త :** మండలంలోని కంసానిపల్లి గ్రామంలో శనివారం శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వాములు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఆంజనేయ స్వామి మాల ధరించిన స్వాములు పల్లకి సేవ ఊరగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీరామ నామస్మరణ చేస్తూ, భజన చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి స్వాములు మాగాణి శ్రీనివాసులు, స్వామి, సత్యదేవుడు, నరేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

**నారాయణ పేట, నవంబరు 29 ప్రభాతవార్త :** 2025 రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయబడిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభంపై వివరాలు అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ప్రజలు దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నిఖిల్

**నారాయణపేట, నవంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా స్థాయి క్రీడా పోటీలలోఎంపికైన నిఖిల్మినీ స్టేడియంలో నిర్వహించిన పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి నిఖిల్ 10వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఘనవిజయం సాధించాడు. నిఖిల్ మానసిక విభాగంలో నిర్వహించిన షాట్‌పుట్ పోటీలో జిల్లా స్థాయిలో 1వ స్థానాన్ని కైవసం చేసుకోగా, రన్నింగ్‌లో కూడా వేగంగా పరిగెత్తి 1వ స్థానం సాధించాడు. ఈ రెండు విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ పీడీ కె. అక్తర్ పాషా, హెచ్‌ఎం దత్తు రావు, సిబ్బంది విద్యార్థులు, హెచ్‌ఎం నిఖిల్‌ను అభినందించారు. నిఖిల్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపి రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే విధంగా ప్రతిభ చూపాలని కోరారు.

## నేటి నుండి సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

**దామరగిద్ద, నవంబరు 29 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని 2వ విడత సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నేటి ఉదయం 10.30 ప్రారంభమవుతుందని ఎంపీడీవో సాయిలక్ష్మి తెలిపారు. నేటి నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని మండల పరిధిలోని గ్రామాలను 10 క్లస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్ కు 3 గ్రామాల చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు.

## రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

**వెల్దండ, నవంబర్ 29 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలో 32 గ్రామపంచాయతీలలో చివరి రోజు శనివారం నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. బండోని పల్లి, కేస్లీ తండా గ్రామ పంచాయతీలలో సర్పంచ్ నామినేషన్లు ఆయా గ్రామాలకు ఒక్కొక్కరే అభ్యర్థులు నామినేషన్లు వేయగా రంగంలో ఒకరే నిలువగా ఏకగ్రీవమయ్యాయి. అదేవిధంగా 8 వార్డులు ఏకగ్రీవంగా నిలిచాయి. బండోనిపల్లి సర్పంచ్‌గా ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి, కేస్లీ తాండ శ్రీను నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

## నామినేషన్‌కు వసతులు కల్పించాలి



ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

**బిజినేపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ వేసేందుకు అన్ని రకాల వసతులు కల్పించాలని ఆర్డీవో సురేష్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ స్వీకరణపై అవగాహన కల్పించారు. అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని 35 గ్రామాలకు జరిగే పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డిఓ సురేష్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో ఖతలప్ప, తహసిల్దార్ మునీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

■ బిజెపి రాష్ట్ర నాయకులు బి.కొండయ్య



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు బి.కొండయ్య

**మక్తల్ టౌన్, నవంబరు 29 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి బిజెపి కార్యకర్త పనిచేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలోని ఏఆర్ఎమ్ ఫంక్షన్ హాల్‌లో బిజెపి మక్తల్ మండల మాజీ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్ మరియువార్డు సభ్యుల స్థానానికి పోటి చెయ్యాలి అని తెలిపారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బిజెపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చెయ్యాలని అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు మంజూరు అవుతాయని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలలో బిజెపి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సోమశేఖర్‌గౌడ్, కల్లూరి నాగప్ప, ప్రతాప్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, కుర్వ హనుమంతు, నారాయణ, మజ్జిగ సురేష్, ఉశేనప్ప, వన్నవాడ శ్రీకాంత్, సత్య శ్రీను, అశోక్ గౌడ్, శ్రీను వాసులు, తిమ్మప్ప, కుర్వలింగం, బ్యాటిరిరాజు, రాజాగౌడ్, తిరుపతి వివిధ గ్రామాల బూత్ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు నిబద్ధతో పనిచేయాలి

**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు స్టేజి2 రిటర్నింగ్ అధికారులు నిబద్ధతో పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులకు (స్టేజి- ॥) ఎన్నికల ట్రినింగ్ నోడల్ అధికారి రమేష్ బాబు తో కలిసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో దశలో రిటర్నింగ్ అధికారి(స్టేజి -॥) పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. మోడల్ కోడ్ఆఫ్ కండక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన ఏర్పాట్లు, భద్రతాచర్యలు, వెబ్‌కాస్టింగ్, సౌకర్యాలు అన్నీ సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగియాలని, క్యూలో నిల్చున్న ఓటర్లకు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించాలన్నారు. పిఒలు ఫార్మ్ 25 (బ్యాలట్ పేపర్ అకౌంట్), పేపర్ సీల్‌అకౌంట్, ప్రెసిడింగ్ అఫీసర్ డైరీ, పిఒ డిక్లరేషన్ వంటి చట్టపరమైన పత్రాలను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఏ విధమైన అక్రమాలు, పోలింగ్ స్టేషన్ వద్ద ప్రచారం, లంచాలు ఇవ్వడం, బెదిరించడం వంటి చర్యలను తీవ్ర నేరంగా పరిగణించి, అలాంటి ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు, ఎంపిడిఓలకు తెలియజేయాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో, పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేసి, కౌంటింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ అదే రోజు మధ్యాహ్నం2గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. మొదట పోస్టల్ బ్యాలెట్స్‌ను లెక్కించి, తర్వాత వార్డ్ మెంబర్ బ్యాలెట్ పేపర్లను వేరు చేసి లెక్కించాలన్నారు. అన్ని వార్డుల వార్డ్ మెంబర్ లెక్కలు పూర్తయ్యాక సర్పంచ్ బ్యాలెట్ పత్రాలను డ్రమ్‌లో కలిపి అభ్యర్థులవారీగా లెక్కించాలన్నారు. గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా సాగేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్, రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లు తనిఖీ చేసిన డిఎస్ఓ కాశి విశ్వనాథ్





రెండు పేర్లతో ఉన్న రైస్ మిల్లు



రైస్‌మిల్లులో రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎస్ఓ

**పెబ్బేర్, నవంబరు29 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీలో ఉన్న శ్రీనివాస ట్రేడర్స్ రైస్ మిల్లు నమ్మదగిన సమాచారం మేరకు శనివారం డిఎస్ఓ కాశి విశ్వనాథ్ తనిఖీ నిర్వహించారు. డిఎస్ఓ మాట్లాడుతూ 2022, 23 సంవత్సరంలో శ్రీనివాస ట్రేడర్స్ మిల్లుకు 38 ఏసీ కేలు ధాన్యం కేటాయించినట్లు వారు ప్రభుత్వానికి తిరిగి ఇవ్వగా ఇంకా 11 ఏసీ కేలు ధాన్యం బ్యాలెన్స్ ఉండగా మిల్లులో ఉన్న ధాన్యాన్ని లెక్కించగా ధాన్యం తక్కువగా ఉన్నట్టు డీఎస్ఓ తెలిపారు. అంతగాక ఒకే మిల్లుకు రెండు పేర్లను వాడుతూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మిల్లుకు పైన రామాంజనేయ రైస్‌మిల్ అని అలాగే కింద శ్రీనివాస ట్రేడర్స్ మీద జిఎస్టితో మిల్లును నడుపుతున్నారని డిఎస్ఓ తెలియజేశారు. బిల్లుపై పై అధికారులకు వివరాలు తెలియజేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిఫాల్ట్‌లో ఉన్న రైస్ మిల్లర్లు మూడు నెలల్లో ధాన్యాన్ని తిరిగి ఇవ్వాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డిఎస్ఓ కాశి విశ్వనాథ్ తెలిపారు.

## రక్తదానం మహాదానం





**నారాయణ పేట, నవంబరు 29 ప్రభాతవార్త:** దీక్షా దివాస్ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా వద్ద విజయవంతంగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో రక్తదానం చేయాలనుకున్న అనేక మందిమిత్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాల్గొని తమ సామాజిక బాధ్యతను నెరవేర్చారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రక్తదానం మహాదానం, ఇది ఒక ప్రాణానికి కొత్త జీవం ఇచ్చే పవిత్ర దానం" అని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ప్రతి ఒక్కరూ రక్తదానానికి రావాలని, అవసరమైనప్పుడుమీ ఒక్క బ్యాగ్‌రక్తం ఎవరో ఒకరి ప్రాణాన్ని నిలబెట్టగలదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీ, శక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొని మిత్రులందరినీ శిబిరాన్ని మరింత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా పట్టణ కేంద్రంలో వైన్ షాప్ పనులు ప్రారంభం

**నారాయణ పేట, నవంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని ప్రధాన చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా సమీపంలో హాస్పిటల్, కళాశాలలు, పోలీస్ స్టేషన్, బస్ స్టాప్ దగ్గర కొత్త వైన్ షాప్ నిర్మాణ పనులు ప్రారంభించడం పట్ల ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, సంఘ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే సెంటర్ కావడంతో అక్కడే బస్ స్టాప్ ఉన్నందున విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రతి రోజూ ప్రయాణిస్తుంటారు. ఆసుపత్రి పరిసరాల్లో వైన్ షాప్ ఉండడం సరికాదని ఇది సామాజికంగా మానసికంగా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు కోరుతున్నది వైన్ షాప్‌ను ప్రస్తుత ప్రదేశం నుండి దూరంగా మార్చాలని ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని అధికారుల జోక్యం అవసరం నగర శాంతి భద్రతలకు అనుకూలమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. స్థానిక విద్యార్థి సంఘాలు, ప్రజా నాయకులు అధికారులు వెంటనే స్పందించి వైన్ షాప్ అనుమతులను పున: పరిశీలించాలని విజ్ఞప్తి చేశాయి.





వైన్ షాపు పనులు ప్రారంభమైన దృశ్యం

## దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు

■ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** దివ్యాంగులు మనోధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఉంటారని, వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. దివ్యమైన అవకాశం ఉన్నవారే దివ్యాంగులని, భగవంతుడు తమకు ఏదో లోటు ఇచ్చాడని భావించకూడదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన దివ్యాంగుల జీవిత చరిత్రల పుస్తకాలు చదివితే, స్ఫూర్తినిచ్చే వీడియోలుచూడడం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని దివ్యాంగులను సైతం ప్రోత్సహిస్తూ ఈ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండడమే కాక, మానసికంగా చురుగ్గా ఆలోచించేందుకు అవకాశం ఉందన్నారు. ఉత్సాహంగా ఉన్నవారికి మంచి ఆలోచనలు వస్తాయని, ఫలితంగా వారి విధుల్లో ప్రతిభ చాటడమే కాక సమాజ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. జిల్లాలో మూడు నైబర్హుడ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని ఇక్కడ శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులకు అవసరమైన చికిత్స అందించటమే కాక ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు ఏ విషయంలోనూ తక్కువ కాదని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని, అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి మొగిలయ్య, జిల్లా సంక్షేమ అధికారిని సునంద, విద్యా శాఖ అధికారిని విజయలక్ష్మి, డివైఎస్ఓ కృష్ణయ్య, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాసులు, డిసిపిఓ నరసింహా, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో క్యారంబోర్డ్ ఆడుతున్న అదనపు కలెక్టర్



సమావేశానికి హాజరైన దివ్యాంగ విద్యార్థులు

## విత్తన చట్టంపై అవగాహన కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న సక్రియ నాయక్

**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా కమిటీ అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రస్తుత వ్యవసాయ సాగు పరిస్థితులకు భారత ప్రభుత్వం నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాద చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు మరియు నర్సరీ మొక్కల యొక్క నాణ్యతను సరైన విధంగానియంత్రించాలని ఉద్దేశంతో ముఖ్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పెద్ద ఎత్తున అందించాలని, నాణ్యతా లోపం, నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని విత్తనాలు దిగుమతిని కూడా సరళీకరించడానికి రైతు హక్కులను పూర్తిగా పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. విత్తనచట్టం అమలు చేయాలనే లక్ష్యంతో వాణిజ్య సరళీకరణ ఏవైనా ఉల్లంఘనలు జరిగినప్పుడు వాటి కారణమైన వారిపై చట్టరీత్యచర్యలు తీసుకునే విధంగా నిబంధనలను పొందుపరచడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఈ చట్టాన్ని పార్లమెంటులో ఆమో దించడానికి ముందుగా వివిధ లబ్దిదారులతో, ప్రయోజన కారుల తో చర్చలు చేపట్టి వారి ద్వారానే వచ్చే సలహాలు, సూచనలను తీసుకొని ఈబిల్లులో మార్పులు చేసితర్వాత ఆమోదించడం జరుగుతుందనిఅన్నారు. కేవికె సైంటిస్ట్‌సురేష్ మాట్లాడుతూ, ప్రతిపాదిత చట్టంలో మొత్తం పది అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయని అన్నారు. ఈ చట్టంలో కేవలం ప్రభుత్వం ద్వారా గుర్తించిన వివిధరకాల విత్తనాలు మాత్రమే నియంత్రించ గలిగే అధికారం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి అక్బర్ భాష, వ్యవసాయ అధికారులు, ఆల్ ఇండియాకృతి సంఘం అధ్యక్షులు గద్వాల్ తరఫున జీకే ఈరన్న, ఐజా గట్టు ఎఫ్‌పిఓలు, విత్తన కంపెనీలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

■ జిల్లా అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్



తేమశాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్

**ఆత్మకూర్ నవంబర్ 29, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వారి ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భీమియా నాయక్ ఆదేశించారు. శనివారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల మరియు దేవరపల్లి గ్రామాల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పెద్ద మొత్తంలో నిల్వ ఉంచడం పై నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి తేమ వచ్చిన వెంటనే కొనుగోలు కేంద్రాల వద్ద తక్షణమే కొనుగోలు చేసి సంబంధిత ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు తక్షణమే పంపించేందుకు చర్యలు చేపట్టాలని ఈ విషయంపై ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆయన సున్నితంగా హెచ్చరించారు. వరి ధాన్యం పండించిన రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టకుండా కేవలం కొనుగోలు కేంద్రాల వద్ద మాత్రమే ఆరబెట్టుకునే విధంగా సంబంధిత అధికారులు రైతులకు సూచించాలని వరి ధాన్యం రహదారులపై ఆరాబెట్టడం వల్ల ప్రమాదాల జరగడమే కాకుండా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విషయాన్ని రైతులకు వివరించే విధంగా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం దేవరపల్లి గ్రామ టీఎస్ఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగాతనిఖీ నిర్వహించి వరిధాన్యం తేమను గుర్తిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు మరి ధాన్యం తరలిం చేందుకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు అనంతరం పట్టణంలోని బాలాజీ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిలువ వివరాలను అడిగి క్షుణ్ణంగా తెలుసుకున్నారు ధాన్యం విక్రయించిన రైతులకు వారం రోజుల్లోనే బోనస్తోపాటు రైతుల ఖాతాల్లో నగదు ను జమ చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుం టుందని ఆయన అన్నారు. ఆయన వెంబడిస్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల మార్గాలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్

**నారాయణ పేట, నవంబరు 29 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యరఘు పాల్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శీల చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇనాంధార్ సైదప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేట ఆర్టీసీ డిపో పరిధిలోని రాయచూర్, సైదాపూర్, యాదగిరి, గుల్బర్గా మొదలైన కర్ణాటక పట్టణాలకు ఇంటర్ స్టేట్ బస్సులు నడపాలని 100 సార్లు కోరినా, డిపో మేనేజర్ స్పందించకపోగా, ఇప్పటికే నడుస్తున్న బొంబాయి, శ్రీశైలం, మంత్రాలయం బస్సులను కూడా రద్దు చేయడం తీవ్రంగా ఖండించారు. లాభాలతో నడుస్తున్న బస్సులను నిలిపివేయడం విచారకరమని అన్నారు. అదేవిధంగా స్థానిక బస్టాండ్ల దుస్థితిని ప్రస్తావిస్తూ, నారాయణపేట, ఉట్కూరు, కోస్గి, మద్దూరు, మరికల్, మక్తల్ బస్టాండ్లు ప్రయాణికులకు అనుకూలంగా లేవని, శానిటేషన్, మెయింటెనెన్స్‌లో డిపోవిఫలమైందని విమర్శించారు. 15 రోజుల్లో పరిష్కారం చేయకుంటే ఆర్టీసీ డిపో ముందు భారీ స్థాయిలో ధర్నా చేపడతాము"అని హెచ్చరించారు. ముంబై, శ్రీశైలం, యాదగిరిగుట్ట, మంత్రాలయం, రాయచూర్ బస్సులను వెంటనే పునరుద్ధరించాలి. పేట డిపో పరిధిలోని బస్టాండ్లను పరి శుభ్రంగా ఉంచి, శానిటేషన్ మెరుగుపరచాలని, పాతబస్టాండ్ వద్దబస్సుల నియంత్రణకోసం ఆర్టీసీసిబ్బందిని నియమించాలని, ప్రయాణికుల సౌకర్యార్థం డీలక్స్ బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## మెజారిటీ సర్పంచులు బిజెపి అభ్యర్థులు గెలవాలి



**ఇటిక్యాల నవంబర్29, ప్రభాతవార్త;** ప్రతి మండలంలో అన్ని గ్రామపంచాయతీలలో బిజెపి పార్టీ నుండి అభ్యర్థులు సర్పంచులుగా. వార్డు మెంబర్లుగా పోటీ చేసి మెజార్టీ స్థానాలు గెలవాలని పోటీచేసిన అభ్యర్థులకు ఎంపీ. డీకే అరుణ. జిల్లా పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని జిల్లా స్థానిక సంస్థల కన్వీనర్ పార్టీమాజీ జిల్లాఅధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలకు వివరించారు. శనివారం ఎర్రవల్లి మండల స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం పార్టీ అధ్యక్షులు జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు రామచంద్రరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... గ్రామపంచాయతీలకు ఎక్కువ మొత్తంలో నిధులు మొత్తం కేంద్ర ప్రభుత్వం నుండే వస్తున్నాయని అందులో భాగంగా రేషన్ బియ్యం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం, ద్వారా రోడ్ల నిర్మాణం, మరుగుదొడ్లు, ఇండ్ల నిర్మాణానికి అత్యధిక మొత్తంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అలాగే వచ్చే నెలలో జరిగే సర్పంచ్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి అధిక మొత్తంలో నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని ఆ దిశగా గ్రామాలలో పోటీ చేసిన అభ్యర్థులు ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త పోటీలో పాల్గొని విజయం దిశగా అడుగులు వేయాలని కోరారు. నామినేషన్ ప్రక్రియఒకటికి రెండుసార్లు పరిశీలించుకోని నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాల న్నారు. అంతేకాక మానవపాడు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యకర్తల సమావేశం పార్టీ అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లామాజీ పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి సీనియర్ నాయకులు రాజగోపాల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, హస్త బీజేవైఎం ఉపాధ్యక్షులు రాజశేఖర్ శర్మ, జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు మహేష్ ,చిన్న నరసింహులు, కోశాధికారి రాముడు, కార్యదర్శి నరేష్, బూత్ అధ్యక్షులు మోహన్ గౌడ్, లింగారెడ్డి తిలక్ రెడ్డి. మదన్మోహన్‌లక్ష్మీనారాయణ, జగన్‌గౌడ్, మధు ,శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

## గ్రామాలలో పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి



బుడ్డారెడ్డిపల్లి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై రవి

**ఇటిక్యాల నవంబర్ 29, ప్రభాతవార్త;** మండలంలో 3వ విడత లో గ్రామపంచాయతీల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుండగా సమస్యాత్మక గ్రామాలు. అలాగే మిగితా గ్రామాలలో నీ ప్రజలు ప్రశాంతంగా ఎన్నికలను జరుపుకునేందుకు అందరూ సహకరించాలని ఎస్ఐ కే. రవి బుడ్డారెడ్డి పల్లి గ్రామ ప్రజలకు సూచించారు. శనివారం మండల పరిధిలోని బుడ్డారెడ్డి పల్లె గ్రామం సమస్యాత్మక గ్రామం కావడంతో వచ్చే నెల డిసెంబర్ 17వ తేదీన మూడవ విడతలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతుండగా ప్రజలందరూ పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధి కోసం ఎన్నికలను ప్రశాంతంగా గొడవలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలని ప్రజలకు గ్రామ యువతకు ఎస్.ఐ.కే. రవి వివరించారు.

## రంగవరంలో తాగునీటికి కటకట

**వీపనగండ్ల నవంబర్ 29,ప్రభాతవార్త;** మండలంలోని రంగవరం గ్రామంలో గతవారం రోజుల నుండి తాగునీరు అందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారుఅని గ్రామస్తులుతెలిపారు. మిషన్ భగీరథ ద్వారా గోపాల్దిన్నె రిజర్వాయర్ నుండి తాగునీరు ఈ గ్రామానికి అందుతుంది అయితే మిషన్ భగీరథ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ ద్వారా చెప్పిన వారు కనీసం నీళ్లు అందక ఎక్కడ ఇబ్బంది పడుతున్నారు. అనే విషయాన్ని తెలుసుకోకుండా గత వారం రోజుల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయితే గ్రామంలో తాగడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామ కార్యదర్శి కూడాపట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీరు ప్రజలకు వెంటనే అందించకపోతే ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నాకు గ్రామస్తులంతా కలిసి కూర్చోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

## బీచుపల్లి శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో ఉత్తరాది మఠం పీఠాధిపతి

**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని శ్రీమన్మధ్వాచార్య మూల మహాసంస్థానం ఉత్తరాది మఠం పీఠాధిపతులైన శ్రీ1008 సత్యాత్మ తీర్థ శ్రీపాదుల వారు శనివారం సందర్శించుకుని మంగళహారతులుసమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సందీప్, వాల్మీకి పూజారులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.

## వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● జిల్లా వైద్యాధికారి రవికుమార్



అంబట్‌పల్లి ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి రవికుమార్

**లింగాల, నవంబరు 29 ప్రభాతవార్త:** ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి రవికుమార్ అన్నారు. శనివారం లింగాల మండల పరిధిలోని అంబట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి ద్వారా రోగులకు సక్రమంగా వైద్యం అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న మందులను పరిశీలించి, ప్రతి రోజూ ఆసుపత్రికి ఎంత ఓపి వస్తుంది అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులపై వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి దశరథ్, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఫార్మాసిస్టు రవిందర్, సాఫ్ట్ నర్సు అనిత పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**అమరచింత నవంబర్ 29, ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం అమరచింత మునిసిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు, ఆర్ ఎన్ రమేష్ మాట్లాడుతూ, అమరచింత మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేక మార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రతినెల వేతనం ఇవ్వాలని జీవో ఉన్న అధికారులు మాత్రము కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆయనఅన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి పెండింగ్ లో ఉన్న మున్సిపల్ కార్మికుల వేతనాలు ఇవ్వాలని ఆయనడిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులకు సంబంధించిన 18 నెలల పిఎఫ్ పెండింగ్లో ఉందని వెంటనే అధికారులు స్పందించి మున్సిపల్ కార్మికుల పిఎఫ్ ఖాతాలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, మహంకాళి ప్రభాకర్, ప్రేమ్ కుమార్, హరికృష్ణ, కాకి శ్రీను, రాజశేఖర్, చిన్న, శ్రీనివాస్, మహేందర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిక



**గద్వాల టౌన్ నవంబర్ 29, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం లోని దాసరిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్యస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డా.ఆంజనేయులుగౌడ్, నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో గోవిందు, రాముడు, గోపాల్, చిన్న బైరామన్న, బత్తలయ్య, ఎల్లపో, ఆంజనేయులు, నరసింహులు, అశోక్, హనుమంతు, ఎల్కొ తిమ్మప్ప, వడ్ల నాగరాజు ఆచారి, సర్వేశ్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నామినేషన్ల పర్వం

● నాలుగు నామినేషన్ కేంద్రాల ఏర్పాటు ● నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో




**చిన్నచింతకుంట, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం చిన్న చింత కుంట మండలాన్ని రెండవ దశ ఎన్నికలను నిర్వహించాలని ప్రకటించింది. దీనిలో భాగంగా ఆది వారం నుంచి బుధవారం వరకు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్‌లు వెయ్యను న్నారు. ఈ నామినేషన్‌లు వేసేందుకు గాను నాలుగు నామినేషన్ కేంద్రాలను కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు తెలిపారు. 1. లాల్ కోట నామినేషన్ కేంద్రం లో లాల్ కోట, పల్లమర్రి, బండర్ పల్లి, పర్దిపూర్, గోపియానాయక్ తండా, 2.వడ్డేమాన్ నామినేషన్ కేంద్రంలో వడ్డేమాన్, చిన్న వడ్డేమాన్ ,ధమగ్నాపూర్, సీతారాంపేట, 3. చిన్న చింతకుంట నామినేషన్ కేంద్రంలో చిన్నచింతకుంట, ఎదులాపూర్,మద్దూర్,ఉంద్యాల,4.అమ్మాపూర్ నామినేషన్ కేంద్రంలో అమ్మాపూర్ ,గూడూర్, కురుమూర్తి, అల్లీపూర్ గ్రామాలలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలోసర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు తమ నామినేషన్లు వేయవచ్చని ఎంపీడీవో తెలిపారు. శనివారం ఆయా నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో పరిశీలించారు.

## నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు



నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లిన పోలేపల్లి యాదమ్మ హాజరైన ఎమ్మెల్యే మాతృమూర్తి శశికళ రెడ్డి

**రాజాపూర్, నవంబరు 29 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం తిరుమలాపుర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పోలేపల్లి యాదయ్య సతీమణి పోలేపల్లి యాదమ్మ శనివారం తమ నామినేషన్ దాఖలు చేశారు. తిర్మలాపూర్ క్లస్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనుంపల్లి శశికళరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పోలేపల్లి యాదయ్య, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



నామినేషన్ దాఖలు చేసిన నరేష్‌నాయక్

**రాజాపూర్, నవంబరు 29 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని సింగమ్మగూడ గ్రామ పంచాయతీ ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా సభావట్ నరేష్ నాయక్ శనివారం తమ నామినేషన్ దాఖలు చేశారు. రంగారెడ్డి గూడ క్లస్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగమ్మగుడా గ్రామపంచాయతీ ప్రజలు తనను ఆశీర్వదిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**రాజాపూర్, నవంబరు 29 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని చొక్కంపేట్ గ్రామ ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా ఆవుల మంద శ్రీలత వెంకటేష్‌శనివారం నామినేషన్‌ను దాఖలు చేశారు. చొక్కంపేట క్లస్టర్ ఎన్నికల రిటర్నింగ్‌అధికారి క్రిష్ణకు తననామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలోపలువురునాయకులు, కార్యకర్తలు గ్రామప్రజలుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**రాజాపూర్ ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా కావలి రామకృష్ణ నామినేషన్ దాఖలు..**

రాజాపూర్ మండల కేంద్రం సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా మండల కేంద్రానికి చెందిన కావలి రామకృష్ణ శనివారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. రాజాపూర్ క్లస్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా బీఆర్ఎస్ పార్టీ కూడా ఇండిపెండెంట్ అభ్యర్థి కావలి రామకృష్ణకు మద్దతు తెలుపుతుంది. ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నామినేషన్ల కేంద్రలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

**కల్వకుర్తి, నవంబర్ 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమం 3వరోజు శనివారం జోరుగాసాగింది. మండలంలోని మార్చాల, తర్నికల్ నామినేషన్లు క్లస్టర్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు రాజ్యలక్ష్మి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఓటరు తమ ఓటును సద్వినియోగం చేసుకునేం దుకు సహకరించాలని సూచించారు. ఏమైన ఇబ్బందులు వస్తే వెంటనే మండల, జిల్లా అధికారు లకు సమాచారం తెలుపాలని సూచించారు. ఆమె వెంట లైజన్ అధికారి సీతారాం, మండల అభివృద్ధి అధికారి వెంకట్ రాములు, తహశీల్దార్ ఇబ్రాహీం, సూపరింటెండెంట్ యాదయ్యలు ఉన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

**నారాయణ పేట, నవంబరు29 ప్రభాతవార్త:** ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అయినప్పటికీ, చేసిన సేవలే గుర్తుండిపోయేలా ఉంటాయని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో సీపీవో యోగానంద్ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఒక సంవత్సరం పాటు ఆయనతో కలిసి పని చేసే అవకాశం లభించిందని కలెక్టర్ పేర్కొన్నారు. నారాయణపేట లాంటి రిమోట్ జిల్లాలో ముఖ్య ప్రణాళిక శాఖలో ఒత్తిడితో కూడిన పనులు విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కుల గణన సర్వేను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో యోగానంద్ చేసిన కృషి విశేషమని చెప్పారు. అలాగే జాతీయ, రాష్ట్ర పండుగల సందర్భంగా గణాంకాలు ఆధారంగా అభివృద్ధి వివరాలు సిద్ధం చేయడం ప్రశంసనీయమన్నారు. పదవీ విరమణకు ముందు ఏడాది ముఖ్యమంత్రితో కలిసి పనిచేసిన సందర్భంగా చిరకాలం గుర్తిండిపోతుందని పేర్కొన్నారు. 36 సంవత్సరాలు ప్రభుత్వ సేవచేసిన యోగానంద్, ఇక కుటుంబంతో సుఖంగా జీవించాలని ఆమె ఆకాంక్షి ంచారు. అదనపు కలెక్టర్ శ్రీనుమాట్లాడుతూ ఉద్యోగంలో చేరినరోజే పదవీ విరమణ తేది నిర్ణయమవుతుందని, ప్రణాళిక శాఖలో దీర్ఘకాలం పనిచేయడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం కలెక్టర్,అదనపు కలెక్టర్, అధికారులు యోగానంద్ దంపతులను శాలువాతో సత్కరించారు.

## దీక్షా దివస్



**మహబూబ్‌నగర్, నవంబరు 29 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద "దీక్షా దివస్" సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రులు డా. చర్లకొల్ల లక్ష్మారెడ్డి ,డా. వి. శ్రీనివాస్ గౌడ్,జడ్చర్ల మున్సిపల్ మాజీ ఛైర్పర్స న్‌దోరేపల్లి లక్ష్మీరవీందర్ అమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఉమాశంకర్‌గౌడ్, చైతన్య హరి కృష్ణగౌడ్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యక్రమాలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కెసిఆర్ దీక్షా దివాస్.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వరం

**అమరచింత నవంబర్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధకుడు కెసిఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దీక్ష దివాస్ చేపట్టి తెలంగాణ రాష్ట్ర ప్రజల కు చిరకాల వాంఛ కల నెరవేర్చిన మహానీయుడు కేసీఆర్ అని టిఆర్ఎస్వి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, మరాడి నరేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన దీక్ష దివాస్ పదహారేళ్లు అయిన సందర్భంగా శనివారం అమరచింత మండల కేంద్రంలోని డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ప్రాణాలకు తృణప్రాయంగా ప్రాణం పెట్టి దీక్ష దివాస్ చేపట్టిన కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారని ఆయన అన్నారు. అలాగేగత టిఆర్ఎస్ పాలనలోప్రతి పేదవాళ్లకుఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసిఆర్ కే దక్కిందని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించారని కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను స్థానిక ఎన్నికలలో గ్రామాలలో గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని వారు కోరారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు,రమేష్ ముదిరాజ్, ఆత్మకూరు మార్కెట్ మాజీ చైర్మన్, ఎస్ ఏ రాజు, మాజీ జెడ్పిటిసి, రాజేందర్ సింగ్, టిఆర్ఎస్వి పార్టీ నాయకులు తోకలి రమేష్, టిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు జింక రవి,తెలుగు రమేష్, డీసీపురుషోత్తం, టిఆర్ఎస్ పార్టీపట్టణ కార్యదర్శి, చిన్న బాలరాజ్, జలంధర్, షాన్ వాజ్ ఖాన్, కోరి శ్రీనివాసులు, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



విసిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్, నవంబరు 29 ప్రభాతవార్త :** రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నిర్వహణలో భాగంగా స్టేజ్-1 రిటర్నింగ్ అధికారుల (ఆర్ఓలు) వెబెక్స్ శిక్షణ కార్యక్రమం శనివారం మహబూబ్‌నగర్ కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 30 నుండి డిసెంబర్ 2వరకు జరుగనున్ననామినేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సిద్ధంగా ఉండాలని సూచించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఎన్నికల మార్గదర్శకాలు, పారదర్శకత, నిజాయితీ అత్యంత ప్రాధాన్యతగల అంశాలు కావున ప్రతిఒక్కరూ అవి ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు, మాస్టర్ ట్రైనర్లు ఆర్ఓలకు నామినేషన్ స్వీకరణ, పరిశీలన, పత్రాల ధృవీకరణ వంటి విధానాలను వివరించారు.

**ఎన్నికల షెడ్యూల్ ప్రకారం...**

డిసెంబర్ 3: నామినేషన్ పత్రాల పరిశీలన, డిసెంబర్ 6: ఉపసంహరణ అనంతరం తుది అభ్యర్థుల జాబితా విడుదత శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, ట్రైనీ డిపిఓ నిఖిల శ్రీ, డిఈఓ ప్రవీణ్ కుమార్‌తో పాటు మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్ బైకాని, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, సాయి బాబా, పాండు రంగ పాల్గొన్నారు.

## పోలింగ్ మెటీరియల్ అన్ని గ్రామ పంచాయతీలకు సక్రమంగా చేరేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 29 ప్రభాతవార్త:** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా అల్లిపూర్ గ్రామం మహబూబ్‌నగర్ రూరల్ మండలం గ్రామం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవోతో కలిసి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించడం జరిగింది. అక్కడ ఉన్న సిబ్బందికి తగుసూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే మహ్మదాబాద్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలో నామినేషన్ వేసే విధానాన్ని పరిశీలించడం జరిగింది. అదేవిధంగా మహమ్మదాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో నిల్వఉంచిన ఎన్నికల మెటీరియల్‌ని పరిశీలించి వాటిని గ్రామపంచాయతీ ఎన్నికలు ఎక్కడైతే జరుగుతున్నాయో అన్ని ఎలక్షన్ కేంద్రాలకు విడివిడిగా 82 ఐటమ్స్ నిప్యాక్ చేసే విధానాన్ని వారికి సూచనలు ఇస్తూ జాగ్రత్తగా పంపించగలరని ఎంపీడీవోకు తాసిల్దార్‌కు సూచనలు ఇవ్వడం జరిగింది.

గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి..

● స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి ● మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

**ఆత్మకూర్ నవంబర్ 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న విషయాన్ని టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలకు వివరించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని మక్తల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థులను ఎంపిక చేసే కార్యక్రమానికి సంబంధించి శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూగత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి ప్రజా ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఒక్క వాగ్దానం కూడా అమలు చేయకుండా ప్రతిపక్షాలపై బురదజల్లే కార్యక్రమాన్ని పెట్టుకుందని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గట్టిగా నిలదీయాలని ఆయన సూచించారు ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ కనీసం అభివృద్ధి పై దృష్టి పెట్టకుండా కేవలం ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులను బెదిరింపులకు మరియు లొంగదీసుకునేందుకు మాత్రమే కాలయాపన చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ఆయన అన్నారు. మక్తల్ నియోజక వర్గంలో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానంటూ గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయి అని రాష్ట్ర మంత్రిని కూడా ప్రజలు నిలదీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రతి మహిళకు 4000 రూపాయల పెన్షన్ మరియు ఒంటరి మహిళలకు 2500 రూపాయల పెన్షన్ వికలాంగులకు 6000 తక్షణమే చెల్లిస్తామని ప్రగల్బాలు పలికి ప్రజలను నైవంచెదక గురి చేసిందని ఆయన ప్రజా ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అంతేకాకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు రైతులకు ఉపయోగపడే విధంగా ప్రవేశపెట్టినటువంటి రైతుబంధు పథకాన్ని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు ఎగ్గొట్టిన విషయాన్ని రైతులకు వివరించి స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశానికి ఆత్మకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షత వహించగా మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు రెచితల సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి స్థానిక టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేలా ప్రోత్సహించాలి




శ్రీవాణి పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని

**ఆత్మకూర్ నవంబర్ 29, ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో విద్యార్థిని విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేలా అధ్యాపక బృందం ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ కని సూచించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన శ్రీవాణి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వనపర్తి జిల్లాలోని చిట్యాల మండల కేంద్రంలో జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైనందుకు ఆయన విద్యార్థిని విద్యార్థులతో పాటుగా ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. చిట్యాల మండలంలోని గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సరోఫీ చేతులమీదుగా ప్రారంభించిన వైజ్ఞానిక పరీక్షలకు ఆత్మకూర్ శ్రీవాణి పాఠశాల చెందిన విద్యార్థిని విద్యార్థులు రెండు భాగాలలో పాల్గొని ఇన్స్పైర్ అవార్డుకు ఎంపిక కావడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ప్రస్తుత పోటీ సమాజంలో తట్టుకొనినిలబడాలంటే చిన్నప్పటినుండే విద్యార్థిలకు ఫ్రెండ్స్ మరియు వైజ్ఞానిక ప్రశ్నలు పాల్గొనేలా ప్రోత్సహించి అభివృద్ధికి మాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా శ్రీవారి పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు దాదాపు 200 మంది విద్యార్థులను తరలించి తిలకించే విధంగా ఏర్పాటు చేసినందుకు అధ్యాపక యాజమాన్యానికి జిల్లా విద్యాధికారి అబ్దుల్ కని ప్రత్యేకంగా అభినందించినట్లుగా పాఠశాల ప్రిన్సిపాల్ లతా గంగాధర్ విలేకరులకు తెలిపారు.

## బీసీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించండి

● అన్ని పార్టీలు భేషరతుగా మద్దతు ప్రకటించాలి ● డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి, నవంబరు 29 ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ కోరారు. శనివారం ఏదుల సర్పంచ్ అభ్యర్థి పరుశురాం యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎర్రగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అనంతరం రాచాల మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఎప్పటికీ పాలితులుగానే ఉండాల్సి రావడం విడ్డూరంగా ఉందన్నారు. ఓ అవకాశం బీసీలకు లభించిందని ఇప్పుడిప్పుడే సమాజంలో బీసీ వాదం పెరుగుతున్న నేపథ్యంలో పార్టీలకతీతంగా నిస్వార్థంగా ప్రజల సమస్యలను పరిష్కరించగల బీసీ అభ్యర్థులను గెలిపించి పంచాయతీల్లో బీసీల ప్రాధాన్యతను పెంచుకుందామని కోరారు. కాంగ్రెస్ పార్టీ కూడా బీసీలకు 42 శాతం ఇస్తామని ప్రకటించిందని, దానికి అనుగుణంగా బీసీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించాలని, మిగతా పార్టీలు కూడా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యతను చాటి భవిష్యత్తు బిసి రాజ్యానికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మశన్న, బీసీ పొలిటికల్ జెఏసి మండల అధ్యక్షుడు హనుమంతు, నాయకులు వివిగౌడ్, దేవర శివ,మహేందర్ నాయుడు, ధర్మేంద్ర సాగర్, రమేష్ గౌడ్‌లు ఉన్నారు.

## దద్దరిల్లిన దీక్షా దివస్




దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యస్. రాజేందర్ రెడ్డి

**నారాయణ పేట, నవంబరు 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తా వద్ద ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్ మోహన్‌రెడ్డి, కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డితో పాటు జిల్లా ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు ఉద్యమ కారులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 29, 2009 తేదీని తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా పేర్కొన్నారు. ఆ రోజున కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమానికి కీలక మలుపు తీసుకువచ్చిందని తెలిపారు. వారి మాటల్లో కేసీఆర్ చేపట్టిన



నిరాహార దీక్షఅనంతరం, రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున ఉద్యమాల్లో పాల్గొనడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ వేగం అందుకుంది" అని అన్నారు. అధికార పార్టీ, కేంద్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు, ప్రజా ఆందోళనలు, సకల జనుల సమ్మె, రైలు రోకో, మిలియన్ మార్చ్ వంటి కార్యక్రమాలు రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ఏర్పాటుకు ముందు 2004-2014 మధ్య జరిగిన ఉద్యమంలో విద్యార్థుల, ఇతర వర్గాల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఉద్యమంలోభాగమైన నాయకులు, కార్యకర్తలకు శాలువాలు పూలమాలతో సన్మానించారు. జిల్లా ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మండల, గ్రామ కమిటీ సభ్యులు, యువ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు మరియు ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## తెలంగాణ ప్రజలకు పవన్ క్షమాపణ చెప్పాల్సిందే

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చిరంజీవి, బాలయ్య, పవన్‌కళ్యాణ్, ప్రభాస్, అల్లు అర్జున్ లాంటిసినీ హీరోలు అందరినీ అభిమానిస్తామని చెప్పారు. 2019 లో ఆంధ్రలో జరిగిన ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన పవన్ కళ్యాణ్ చిత్తుగా ఓడిపోతే, కనీసం పవన్ ఒక్కరైనా గెలిచి ఉంటే అసెంబ్లీకి వెళ్లి ఉండేవారని తాను కూడా బాధ పడ్డానని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయకుండా చంద్రబాబు నాయుడుతో పొత్తుపెట్టుకొని గెలిచి,పదవి తెచ్చుకున్నారని, పొత్తు లేకుండా ఈసారి కూడా ఒంటరిగా పోటీ చేసి ఉంటే పవన్ సత్తా ఏమిటో తెలిసేదని పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి తమ్మునిగా ఆయన పేరు చెప్పుకుంటేనే నీకు స్థానం ఉంటుంది. అయినా నీకు మేము గౌరవం ఇస్తున్నాం అని వ్యాఖ్యానించారు. అలా మాట్లాడమే కరెక్ట్ అయితే ఏపీపై అంత ప్రేమే ఉంటే తెలంగాణలో ఉన్న ఆస్తులను అమ్ముకొని విజయవాడకు పోయి అక్కడి ప్రజలకు 24 గంటలూ సేవ చేయాలని సూచించారు. తాను పదహైదేళ్ల తర్వాత సీఎం అవుతానంటూపవన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తా విస్తూ, తాను ఓ సామాన్యుడిగా జడ్చర్ల ప్రజల మద్దతుతో పదేళ్ల తర్వాత సీఎంఅభ్యర్థి అవుతానంటుంటే పవన్ కళ్యాణ్ పదహైదేళ్ల తర్వాత సీఎం అవుతానంటున్నారని, డెబ్బై ఏళ్ల వయసులో అప్పుడు ఆయన సీఎం అయి చేసేదేముంటుందని అనిరుధ్ రెడ్డి ఎద్దేవా చేశారు. పదహైదేళ్ల దాకా ఎదురు చూడటం ఎందుకని, రాబోయేఎన్నికల్లోనే ఒంటరిగా పోటీచేసి గెలవాలని సూచిం చారు. తెలంగాణ ప్రజలవి దిష్టి కళ్లు కావని, ఆయన గెలవాలనే తాము కూడా కోరుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రజలవి దిష్టి కండ్లు అని చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమా పణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆంధ్రలో జగన్ గెలిస్తే టీడీపీ, జనసేన, బీజేపీ వాళ్లందరూ హైదరాబాద్ కు వచ్చి తలదాచుకుంటారని, టీడీపీ గెలిస్తే వైసీపీ వాళ్లు హైదరాబాద్ లో తలదాచుకుంటారని, తలదాచుకోవడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి హైదరాబాద్ తెలంగాణా కావాలి గానీ, తెలంగాణ ప్రజలది నరదిష్టిఅని నిందిస్తారా ?అని అనిరుధ్ రెడ్డి నిలదీశారు. మీరు క్షమాపణ చెప్పాల్సిందే లేకపోతే హైదరాబాద్‌లో ఎందుకు ఆస్తులు కొంటున్నారు. అప్పులన్నీ తీరిపోయినాయంట కదా, అని ప్రజలందరూ అంటున్నార అని పవన్ ను ఉద్దేశించి అనిరుధ్ వ్యాఖ్యానించారు. రామ్‌చరణ్, అల్లుఅర్జున్ తెలంగాణ అమ్మాయిలనే పెళ్లి చేసుకున్నారని ప్రస్తావిస్తూ, మా ఆస్తులు కావాలి, మాకు సంబంధించినవన్నీ కావాలి కానీ మావి దిష్టి కండ్లు అంటారా అని పవన్‌ను నిలదీశారు. కాగా సినిమా టిక్కెట్ ధరలు పెంచాలంటే అందులో 20 శాతం మొత్తాన్ని సినీ కార్మికులు అందరికీ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి హ్యాట్సాఫ్ అని పేర్కొన్నారు.

## కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

తీసుకెళ్లి 14ఎఫ్‌కి వ్యతిరేకంగా ఉద్యోగులు పోరాటం చేస్తుంటే కేసీఆర్ పిలుపించుకొని మద్దతు తెలిపారన్నారు. 14ఎఫ్ రద్దు కోసం సిద్దిపేట సభలో ఏర్పా టు చేస్తే అక్కడే ఆమరణదీక్ష చేస్తామని కేసీఆర్ ప్రకటన చేశార న్నారు. తెలంగాణ ప్రకటన వచ్చే వరకు దీక్ష విరమణ చేయనని కేసీఆర్ చెప్పగా.. ప్రకటన వచ్చిన తర్వాత దీక్ష విరమణ చేసి తెలం గాణ రాష్ట్రం సాధించడం మరుపురాని ఘట్టం అని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.50 పింఛన్, కరెంట్ లేక రైతుల ఆత్మహత్యలు ఉండేవని, రాష్ట్రం సాధన అనంతరం కేసీఆర్ సారథ్యంలో కరెంట్, పంట సాగు, మంచి నీళ్లు, రెండువేల పింఛన్ ప్రజలకు అందించి పదేండ్లల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందనన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని వదిలిపెడితే రాళ్లతో కొట్టి చంపండని ప్రజలకు సవాల్ చేసిన గొప్ప నేతకేసీఆర్ అని కొనియాడారు. భవిష్యత్‌లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ దొడ్డి వెంకట్రాములు, మాజీ జడ్పీటీసీలు బాసు శ్యామల హనుమంతు నాయుడు, పద్మ వెంకటేశ్వరరెడ్డి ,అంగడి బసవరాజ్, మోనేష్, రాజారెడ్డి, యూసఫ్, రంగారెడ్డి, పటేల్ జనార్దన్ రెడ్డి, ఆర్. కిషోర్, కురవ పల్లయ్య ప్రేమలత, రవి ప్రకాష్ గౌడ్, వెంకటేష్ నాయుడు, శ్రీరాములు, రామకృష్ణ, మల్లికార్జున్, రజిని బాబు, అవనిశ్రీ, డ్యామ్ శ్రీను, నాగరాజు, వెంకటేష్, నరసింహులు, అంజి, గంగాధర్, రమేష్, రాము, రంగన్న, రాజేష్, గోవిందు, మరియు వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 25 లక్షలకు ఏకగ్రీవమైన జూలకల

**వడ్డేపల్లి, నవంబరు29 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జూలకల్లు గ్రామ సర్పంచ్ పదవి రూ. 25 లక్షలకు ఏకగ్రీవం అయింది. అయితే గ్రామంలో 75% ఎస్సీలకి ఇష్టం లేదని అంటున్నారు. అయితే గ్రామంలో బీసీలు అంత కలిసి మా ఓట్లు 75% ఉన్నాయి మేమందరము ఒకవైపు ఓటు వేసి ఒకరిని గెలిపించుకుంటాం అని కొంతమంది ఎస్సీలను పిల్చుకొని ఏకగ్రీవం చేశారు.

## మృతురాలి కుటుంబానికి డిఎన్ఆర్ ఆర్థిక చేయూత

**ఊర్కొండ, నవంబరు29 ప్రభాతవార్త :** మండలంలోని గుడిగాని పల్లి గ్రామానికి చెందిన బీమని అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి (డిఎన్ఆర్) మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5000/ అందజేశారు. కార్యక్రమంలో మృతురాలి భర్త బీమని జంగయ్య, కుమారుడు ఆంజనేయులు, కూతురు భవిత, మాజీ సర్పంచులు రజిత కృష్ణయ్య, జంగమ్మ, జంగయ్య, మాజీ వార్డు సభ్యులు కవిత రుక్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు విజేందర్ రెడ్డి, పిల్లెల్ల యాదయ్య, టైగర్ జంగయ్య, బీమని లక్ష్మయ్య, సాయిలు, రవీందర్, కర్రె వెంకటయ్య, జోగు శ్రీపతి, వెంకటేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.